ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 04.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సచివాలయంలో నిన్న జరిగిన కలెక్టర్ల సదస్సులో 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
2. ములుగు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు నీరు అందించాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
3. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్న కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జైలు నుంచి విడుదలయ్యారు.
4. రాష్ట్రవ్యాప్తంగా హోలీ వేడుకలు రెండో రోజు కూడా అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.
5. టీ20 వరల్డ్ కప్ లో భాగంగా ఈరోజు కోల్ కతాలో జరిగే తొలి సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి.

**<u>ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశం</u>**

సచివాలయంలో నిన్న జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, క్షేత్రస్థాయి పర్యటనలు కలెక్టర్ల పనితీరుకు కొలమానమని స్పష్టం చేశారు. నెలకు కనీసం పది రోజులు పర్యటించని అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల

ద్వారా జరుగుతున్న బోగస్ ఉద్యోగుల దందాను అరికట్టాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న 3 వేల 900 కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని రికవరీ చేయాలని, ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని సూచించారు. అక్రమాలు జరిగితే సంబంధిత కలెక్టర్, ఎస్పీలపై వేటు పడుతుందని సీఎం హెచ్చరించారు. భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి సూచించారు. అధికారుల వార్షిక పనితీరు ఆధారంగానే రివార్డులు ఉంటాయని, జూన్‌లో మరోసారి పురోగతిని సమీక్షిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**డెస్క్**

**<u>మంత్రుల సమీక్ష</u>**

ములుగు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన నీరు అందించాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో దేవాదుల ఎత్తిపోతల పథకంతో పాటు గోదావరిపై ఉన్న ప్రాజెక్టుల పురోగతిని వారు పరిశీలించారు. రాబోయే రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, ఇందుకోసం అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**డెస్క్**

**<u>బాల్క సుమన్</u>**

మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్న కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు.

క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయడంతో, కోర్టు సుమన్ కు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ ముగియడంతో జైలు నుంచి బయటకు వచ్చిన సుమన్‌కు మాజీ మంత్రి జోగు రామన్న, ఇతర పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ కేసులో సుమన్ తో పాటు మరికొందరు నాయకులు కూడా అభియోగాలు ఎదుర్కొంటున్నారు.

**BYTE SUMAN**

**<u>అగ్నిప్రమాదం</u>**

హైదరాబాద్ బాచుపల్లి ప్రధాన రహదారిలోని ఫర్నిచర్ దుకాణాల్లో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక దుకాణంలో మొదలైన మంటలు కలప, ఫోమ్ వంటి వస్తువుల వల్ల వేగంగా వ్యాపించి సుమారు 18 షాపులను దహనం చేశాయి. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటల తీవ్రత మరింత పెరిగి కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆరు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

**DESK**

**<u>అగ్రికల్చర్ మెకానైజేషన్</u>**

సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానైజేషన్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు 10 డ్రోన్లను మంజూరు చేసినట్లు నిర్మల్ జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తెలిపారు. వీటిని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు కేటాయిస్తామని వివరించారు. ఒక్కో డ్రోన్ ధర 6 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ఉండగా, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందిస్తుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను పెంపొందించే ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని రైతు సంఘాలు, సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీటీసీ - నిర్మల్

**<u>బీజేపీ - పాల్వాయి హరీష్ బాబు</u>**

కాగజ్‌నగర్ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి అపరిశుభ్రతపై అధికారులపై సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో ప్రయాణించే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని హరీష్ బాబు స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే పర్యటన అనంతరం అప్రమత్తమైన అధికారులు హుటాహుటిన ప్రయాణ ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. జిల్లాలోని ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదేశించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**<u>మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు</u>**

2026-27 విద్యా సంవత్సరానికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల గిరిజన విద్యార్థుల నుండి కిన్నెరసాని, కచనపల్లి మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఐటీడీఏ పీవో బి. రాహుల్ దరఖాస్తులు ఆహ్వానించారు. ఐదో తరగతిలో ఖాళీగా ఉన్న 80 సీట్లతో పాటు బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపికలు మార్చి 16 నుంచి 18 వరకు, తుది ఎంపికలు మార్చి 28 నుంచి 30 వరకు జరుగుతాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను కిన్నెరసాని లేదా ఉసిరికాయలపల్లి పాఠశాలల్లో సమర్పించాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ కోరారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

<u>చంద్ర గ్రహణం</u>

ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా నింగిలో 'బ్లడ్ మూన్' అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. భూమి నీడ చంద్రుడిపై పడటంతో జాబిల్లి ఎర్రని రంగులో మెరిసి తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా వీక్షకులను అలరించింది. రాష్ట్రంలో మధ్యాహ్నం 2గంటల 13 నిమిషాలకు

చంద్రగ్రహణం ప్రారంభమై సాయంత్రం 6. గంటల 48నిమిషాలకు ముగిసింది. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6గంటల 22నిమిషాలకు చంద్రోదయమైంది. అప్పటికే చంద్రుడు గ్రహణ విముక్తి దశలో ఉన్నాడు. సాయంత్రం 6.22 నుంచి 6.48 గంటల వరకు కేవలం 22 నిమిషాలపాటు పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది. చంద్రోదయం సమయంలో చంద్రుడు.. క్షితిజానికి కేవలం 1-5 డిగ్రీల ఎత్తులో ఉండటం వల్ల నిశితంగా గమనించిన వారికి గ్రహణం కనిపించింది.

సంపూర్ణ చంద్రగ్రహణం ముగియడంతో  నిన్న రాష్ట్రవ్యాప్తంగా మూసివేసిన ఆలయాలు తెరుచుకున్నాయి. యాదగిరిగుట్ట, భద్రాచలం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం,  వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయాలలో పుణ్యవచనం,  సంప్రోక్షణ, మహా నివేదన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలను ప్రారంభించారు.

డెస్క్

<u>హోలీ వేడుకలు</u>

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హోలీ వేడుకలు రెండో రోజు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నిన్న రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించడంతో మెజారిటీ ప్రజలు రంగుల పండుగను జరుపుకోగా, తిథి ప్రభావం మరియు చంద్రగ్రహణం కారణంగా మరికొందరు ఈరోజు వేడుకల్లో మునిగిపోయారు. రాజధాని హైదరాబాద్‌లో భారీ ఎత్తున హోలీ పార్టీలు ఏర్పాటు చేయగా, నగరవాసులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేరింతల మధ్య రంగులు పూసుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కోనేరు కోనప్ప కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జనగామ జిల్లా పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.  జోగులాంబ గద్వాల జిల్లాలోని ఐజ, అలంపూర్ ప్రాంతాల్లో యువత, చిన్నపిల్లలు నీటి రంగులతో సోదరభావాన్ని చాటుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రకృతి సిద్ధమైన రంగులనే వాడాలని ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా సూచించారు.

డెస్క్

**<u>ఆది శ్రీనివాస్</u>**

చెడుపై మంచి గెలుపునకు నిదర్శనంగా మానవాళి జరుపుకునే గొప్ప పండుగ హోలీ అని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం లోని రెండో రోజు జరిగిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీ పండుగ సంప్రదాయాలు, ఐక్యత, ఆనందానికి నిదర్శనమన్నారు. ఈ పండుగ ప్రతీ కుటుంబంలో ఆనందం, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. రంగులతో ఒకరినొకరు ఆహ్వానించుకుంటూ స్నేహభావాన్ని పంచుకునే ఈ వేడుక సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు సురక్షితంగా, పర్యావరణహితంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు

**Byte**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**<u>'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'</u>**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రణాళిక శాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తూ, ఐదు దశల్లో 99 రోజుల కార్యాచరణను అమలు చేయనుంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ సభలు మొదలై, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో వివిధ అంశాలపై అవగాహన సదస్సులు, అభివృద్ధి పనుల శంకుస్థాపనలు జరుగుతాయి. ఆరోగ్యం, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత మరియు పర్యావరణ పరిరక్షణ వంటి పది ప్రధానాంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమాల అమలుపై ఈనెల 6న పాలమూరులో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**<u>టీ20 వరల్డ్ కప్</u>**

టీ20 వరల్డ్ కప్ తొలి సెమీఫైనల్‌లో నేడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి దక్షిణాఫ్రికా అజేయంగా నిలవగా, కివీస్ ప్రస్థానం మాత్రం ఎత్తుపల్లాలతో సాగింది. సఫారీ జట్టులో కెప్టెన్ మార్‌క్రమ్, డికాక్, మిల్లర్ అద్భుత ఫామ్‌లో ఉండగా, రబాడ, ఎన్‌గిడి బౌలింగ్‌లో రాణిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో నిలకడలేమితో సతమతమవుతోంది. గత మ్యాచ్‌లో కివీస్‌పై సులభంగా గెలిచిన దక్షిణాఫ్రికా అదే జోరును కొనసాగించి ఫైనల్‌కు చేరాలని చూస్తుండగా, ప్రతీకారం తీర్చుకోవాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ప్రస్తుత ఫామ్ దృష్ట్యా దక్షిణాఫ్రికాకే గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**NSD**

**<u>ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్</u>**

ఇంగ్లాండ్ లోని  బర్మింగ్హామ్‌లో ప్రారంభమైన ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ లక్ష్య సేన్ సంచలన విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 23-21, 19-21, 21-17 పాయింట్స్ తో ప్రపంచ నంబర్ వన్ షీ యుకీని  షి యుకిని కంగుతినిపించి... ప్రిక్వార్టర్‌స్‌లోకి ప్రవేశించారు.  మహిళల విభాగంలో ఒలింపిక్ ఛాంపియన్ అన్ సెయంగ్ శుభారంభం చేయగా, భారత్‌కు చెందిన తనీషా క్రాస్టో - ధ్రువ్ కపిల జోడీ కూడా రెండో రౌండ్‌కు చేరుకుంది. అయితే, పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన పీవీ సింధు, దురదృష్టవశాత్తూ ఈ టోర్నీకి దూరమై స్వదేశానికి తిరిగి వచ్చారు.

**NSD**